# జబర్దస్తీ

ఆయుపిళ్ల 'సత్తిబాబు'

బజారునుంచి పంచదారపొట్లాం తెస్తోవుంటే చేతిలోనుంచి జారి కిందను పడింది, పొట్లాం. ఎలా జారిందో తనకే తెలీదూ. అంతఅజాగ్రత్తగా నడిచినందుకు తనలో తనే ఎంతోలా యిదయ్యేడు. ఆ పగిలినపొట్లాన్నే ఇంటికి తీసుకెళ్లాడు. ఒదినడిగింది "పొట్లాం పగిలిందేం?" ఆ ప్రశ్నవస్తుందని అతని గుండెలు శతాధికంగా కొట్టుకుంటూనే వున్నై. "దారిలో వొలికిందండీ"

"దారిలో వొలికింది! వొలకదూ? ముక్కుకింద గాతలో ఒలుకుతుంది. చేదాయేం పంచదార!!"—

తనేం జవాబు యివ్వలేదు...

"పొట్లాం యిలానే వుండనీయాలి, అతనొచ్చి ఏదో చూడాలి" ఆమె పొట్లాన్ని అక్కడనే దించేసి కోపంగా యింట్లోకి వెళ్ళిపోయింది. తరువాత అన్నయ్య కొట్టినదెబ్బలు మూడునాలవరకూ మాయనేలేదు.

ఓమాటు వొదిన అణాయిచ్చి వంకాయలు తీసుకురమ్మంది. తను తెచ్చాడు అణావి—

"అణావంకాయలు ఇవేనోయ్ - యివ్వీ!!"

"అవునండీ"

"ఏ అశపోతిచ్చిందోయ్! అణావంకాయలు టివ్వీ?"

"అణాదేనండీ"—

"సిగ్గులేదటోయి! అణావా? అరణావా?— అంత వాపిరివాడవయితే - అరణా అడుక్కుంటే యివ్వనుటోయి. ఈ పిప్పి వెధయకాయులు నేను కూరవండలేనమ్మా!" వంకాయలబుట్ట మీదకువిసిరి వంటింట్లోకి చరచరా వెళ్ళిపోయింది వొదిన.

ఓనాడు స్కూలునుంచి వొచ్చింతర్వాత అన్నయ్యడిగాడు "అబ్బాయి చేతిలో పావలాకాసేమయిందిరా?—"

"ఏ అబ్బాయిచేతిలో?"—

"ఏ అబ్బాయిచేతిలో! - వెధవ - ఎందరబ్బాయిలున్నార్రా మనింట్లోనూ?"

"నాకేం తెలీదన్నయ్యా"

"తెలీదోయ్! అబ్బాయిని వీధిచివరవరకూ ఎత్తుకు వెళ్ళలేదటోయ్! పావలా కాసును భూమి మింగేయదుకద! రెక్కలొచ్చి ఎగిరిపోలేదుకద!... ఆ చేతిలో కొత్తపెన్సలెక్కడిదీ?—"

"మా క్లాసు కుర్రాడిచ్చేడు"— నామాట పూర్తికాలేదింకానూ, కుర్చీమీదనుండి ఎగిరి వొక్క లెంపకాయ కొట్టేడు అన్నయ్య- కళ్లు గిరగిర తిరిగినయ్ "వేలెడంత వున్నావో లేవోగాని దొంగతనం


మీకు ఏమి కావాలి?

వడ్లు, పిండి, మిరపకాయలు
శీకాయ మొదలైన దంపుడు
మిషన్లున్నూ, వాటికి కావలసిన
చిల్లర సామాన్లున్నూ, బెల్టులు,
తదితర వస్తువులున్నూ, మావద్ద
దొరకును.

★

గొప్ప పనితనము, చాలాకాలము మన్నును.
ధరను చాలా తక్కువ.

వివరాలకు:

ఆర్. ఆర్. బ్రదర్సు & కో.,

(మిషనరీ వ్యాపారులు)

306, లింగిచెట్టి వీధి :: జి. టి. మద్రాసు.

కూడానా?'' అన్నయ్య కొట్టిన రెండవ చెంప కాయతో స్మారకం పూర్తిగా తప్పిపోయింది...

ఇలాంటి సంఘటనలు జరగనిరోజు వొక్కటి వెళ్లలేదు యింతవరకూను... అమ్మ, నాన్న లేకపోవటానికి తనెంత పాపం చేసుకున్నాడు........ పార్కు లో కూర్చుని నెమరు వేసుకుంటున్నాడు సూర్యం. పదహారు సంవత్సరాలొచ్చాయ్ సూర్యానికి. ఈ సంవత్సరమే స్కూలుఫైనల్ పరీక్ష కూడ వెళ్లాడు...




శుక్లనష్టానికి వజ్రాయుధం

'లు కో'

LUCO

కలలోను, మూత్రంలోను పోయే యెటువంటి శుక్లనష్టాన్నైనా నిల్పును. నీరైన వీర్యాన్ని గట్టిపరచి, వెన్నెముకను దృఢపరచి నపుంసకత్వము పోగొట్టి ఇంద్రియనాడులకు పటుత్వము, వీర్యకమలములకు బలము కలిగించి సంసారసుఖమనుభవింపజేయును. కోరవడని వీర్యవృద్ధినిచ్చి ముసలితనమును పోగొట్టును.

చిన్న ప్యాకెట్ రు. 3/- పెద్దది రు. 5/0

వి. పి. చార్జి రు. 0-12-0.

ది మెడికల్ ప్రాడక్ట్సు కంపెనీ,

పో. బా. 57, మద్రాసు.

పార్కులోకి యిలాగ ఏ అయిదు నెలలకో ఆరునెలలకో వస్తోవుంటాడు... ఆ చెట్లూ, పువ్వులూ, తమ యిష్టానుసారంగా ఎగిరిపోతోవున్న పిట్టలూ, ఆడుకుందికి వొచ్చినపిల్లల్ని చూస్తోవుంటె అతని శరీరం మైమరచింది...

''సూర్యంరోయ్'' అన్నాడు ఓ ఫ్రెండు.

''ఏవూరు పండిందోరా, పార్కు లోకి దిగడ్డాడు అన్నాడు యింకో స్నేహితుడు...

''పరీక్షలయ్యాయని కాబోలు శలవిచ్చాడు అన్నయ్య'' అని ఊహించేడు యింకోమిత్రుడు.

''కాదురా - వొదిన అనుజ్ఞయిచ్చివుంటుంది'' లయవేశాడు యింకో ఆప్తుడు.

అందరు కూర్చున్నారు సూర్యం చుట్టూను. సూర్యం అడిగాడు వాళ్ళని ''మీరు రోజూ వస్తోవుంటారేమిటి, పార్కులోకి—?''

''మాకేం రాక?— ఈ పువ్వులు, చెట్లూ, తోటా, యీస్థలం అన్నీ మనవే - మనం యిచ్చిన సొమ్ముతీసుకొని హెల్తుడిపార్టుమెంటు చేసిన సౌకర్యం యిది!''

ఆశ్చర్యంగా వింటున్నాడు సూర్యం—

—ఆరుగంటలు కొట్టారు.

సూర్యం తొందరగా లేచాడు—

''ఏం—?'' మిత్రులు.

''ఇంటికి వెళ్ళాలి''

''ఇంత వేగం ?— సూర్యుడు అస్తమించకుండానే!''

''వెళ్ళిపోవాలి''

సూర్యం వెనక్కుతిరిగితే మిత్రులు చేతిని పట్టుకు లాగారు.

''ఇంత పిరికితనం ఏమిటోయి సూర్యం?''

''వొదిన చీవాట్లేస్తుందని భయంరా''

సూర్యం సిగ్గుతోనే అడిగాడు: ''మీరు వెళ్ళకపోతే యింట్లో కూకలెయ్యరూ?''

పక్కున నవ్వారు అంతమందీను—“మావాళ్లే యిక్కడకు పంపించింది ఈ ప్రపంచం అంతా ఎందుకనుకున్నావ్?! ఈ చేతులు, కాళ్ళూ స్కూలుకు వెళ్ళి చదువుకుందికి, ఇంట్లో అన్నయ్యగారి పిల్లల్ని ఎత్తుక తిరిగేందుకే కాదు—

అంతా గొల్లున నవ్వారు.

సూర్యం మనస్సు అన్నివిధాల పిచ్చెక్కిపోతోవుంది—

“టైమయిందోయ్ లెండి” అన్నాడు ఓ మిత్రుడు.

“సూర్యంకూడ వస్తాడోయి” అన్నాడింకోడు.

సూర్యాన్ని పట్టుకు లేపారు.

“ఎక్కడికి?”

“సినీమాకి—”

“సినిమాకే!...... నేను రాను”—

“నువ్వొట్టి పిరికివాడవోయ్ సూర్యం! కేవలం చదువుకున్న తెలివితేటలు తప్ప ప్రపంచజ్ఞానం ఒక్కపిసరూ లేదు”

సుద్ధ వాజమ్మలా అడిగేడు సూర్యం—“మరి సినీమాకు డబ్బులో?”

మిత్రులు సూర్యం రెక్కలు పట్టుకుని జేబులు చూపెట్టి గలగల లాడించారు..........రాత్రి పదయింతర్వాత రోడ్డంట నడవటం సూర్యానికదే మొదటితూరి—సినీమా చూశాడు—‘నవజీవన్’—అతను నడుస్తోవుంటే ఎదురుగా ‘నవజీవన్’ తిరిగి పోతోవుంది.


ముఖ అందానికి, కాంతి, సునుపు అమూల్యమైనది

సైబాల్ ★ **CIBOL**

[రిజిష్టర్డ్] (Registered)

ఇంకా పుండ్లు, రణగడ్డలు, కాల్పులు, పిల్లల చీడ, గజ్జి మొదలయినవాటికికూడా అమోఘంగా పనిచేస్తుంది.

చర్మాన్ని రక్షించి కాంతివంతంగా చేసేదానిలో దీనిని మించినదిలేదు, అమ్ముటకు అంతటా ఏజంట్లు కావలెను.

తయారుచేయువారు:

THE SOUTH INDIAN Mfg. Co., MADURA.

మదరాసు, ఆంధ్రజిల్లాలకు ఏజంట్లు!

రాజన్ డ్రగ్ స్టోర్సు,

155, నైనియప్ప నాయకన్ వీధి, పి. టి., మదరాసు.

అతని అన్నయ్య వీధిలోనే లైటు వెలిగించుకొని కూర్చున్నాడు—

సూర్యం గుమ్మం ఎక్కాడు

"ఎక్కడికెళ్లావురా?" అన్నయ్య 'పిడుగు' వదిలాడు.

"సినీమాకి"

సూర్యం యెప్పుడూ అసత్యాన్ని చెప్పలేదు. అయితే యెప్పుడు సత్యాన్నే చాల భయంగా వెల్లడించేవాడు. ఇప్పుడుమట్టుకు యెక్కడలేని నిర్భయంతోనూ చెప్పాడు.

ఒదిన కళ్లు నులుపుకుంటూ మంచంమీదనుండి లేచివచ్చింది—

"పావలా కాసేమవుతుంది?— పాపం సినీమా చూశాడు...చూడకూడదాయేం!"

అన్నయ్య చివాలునలేచి ఝోరుగా చేతిని విసరాడు—సూర్యం మాంచి 'ఎటింటివ్' లోనే వున్నాడు. ఇదివరకల్లె అన్నయ్యచేతి విసరుకి బుగ్గ నందీయలా. చురుగ్గా పక్కకు తప్పుకుని రోడ్డు మీదకు వచ్చేశాడు—

"అన్నయ్యా! నీ చేతి దెబ్బ రిగుతప్పిందని మరేం ప్రయత్నించబోకు! ప్రపంచం యెప్పుడూ గుడ్డిగా కూర్చోదు. నేనెంతమట్టుకు నిజాయితీ మనిషినవునో నేనే తెలుసుకోగలిగాను. నీకూ తెలుసునులే—అయినా ఆ సంగతి వొదిన్నడుగు! ఇంకా నువ్వు చెప్పేడు మాటలు వినే కుక్కవయి చెయ్యిచేసుకోబోతే మనం నడివీధిలో కెళ్ళవలసొస్తుంది—ఇదే చెప్తున్నాను"—

సూర్యం ధీమాగాగుమ్మం ఎక్కి అన్నయ్యనూ, వొదిన్నీ రాసుకునే యింట్లోకెళ్ళిపోయాడు.


తిరుమయిసై ఆళ్వార్! తిరుమయిసై ఆళ్వార్!!

చెన్నపురియంతయు యిదియేమాట

విష్ణుభక్తుడైన తిరుమయిసై ఆళ్వార్

ఈ నాటకములో:

జంతువులు నటించుచున్నవి. నిజమైన పామునుధరించి శివుడు నటనమాడు దృశ్యము ఆశ్చర్యమైనది.
కళలలో నిపుణులైన స్త్రీలడాన్సు. చెవులకు యింపైన మాటలు.
చాతుర్యమైన వచనములు. ఆశ్చర్యమైన సీనులు.

చెన్నపట్టణం న్యూ థియేటరులో (మౌంటురోడ్డు పోస్టాఫీసుకు యెదురుగా)

మంగళ, బుధ, శుక్ర, ఆదివారం సాయంత్రం 6-30 గంటలకు
సోమ, గురు, శనివారం రాత్రి 9-30 గంటలకు

టిక్కెట్లు వివరం: 3-8-0, 2-12-0, 1-10-0, 1-3-0, 0-10-0.
మొదటి రెండు తరగతులకుమాత్రం సాయంత్రం 3 గంటలకు రిజర్వుచేయబడును.
రిజర్వేషన్ టిక్కెట్టు 1-కి 0-5-6.